

భీమేశ్వరాలయంలో కోటి దీపోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వరాలయంలో గురువారం కోటి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. దీపాలంకరణ పూజల్లో వేలాది మంది మహిళలు పాల్గొని ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నింపారు. దీపారాధన అనంతరం వేలాది మంది ఒకేసారి బయటికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో కొంత రద్దీ ఏర్పడింది. పరిస్థితిని డిఎస్‌పి డి.శ్రీహరి రాజు పర్యవేక్షణలో సిఐ కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో అదుపు చేశారు.



దీపాలతో వెలుగుతున్న ఆలయం

అన్నదాతకు దక్కని 'సుఖీభవ'

- మళ్లీ సాగుదారులకు మొండి చేయి
- అరకొరగా సిసిఆర్ కార్డులు


ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు ప్రతి సందర్భంలోనూ అన్యాయమే చేస్తోంది. కౌలు రైతు గుర్తింపు కార్డులను అరకొరమందికి మాత్రమే జారీ చేస్తోంది. దీనికి తోడు వివిధ ప్రభుత్వ పథకాలలో వీరిని పూర్తిగా పక్కన పెడుతోంది. రుణాలు సైతం పూర్తిస్థాయిలో అందించని పరిస్థితి ఏర్పడింది. రెండు రోజుల క్రితం రెండో విడత అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులందరికీ సాయం అందించగా కౌలు రైతులకు మాత్రం మొండి చేయి చూపారు. జిల్లాలో 70 నుంచి 80 శాతం మంది వాస్తవ సాగుదారులు ఉండగా ప్రభుత్వ పథకాలు ఏమీ అమలు కాని పరిస్థితులలో ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో పంటలను సాగు చేస్తున్న వారిలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్టు అంచనా. గత ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన కౌలు రైతు చట్టంతో వీరికి అన్యాయం జరుగుతోంది. సిసిఆర్ కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు ఇస్తామని చెబుతోంది. ఈ ఏడాది 69 వేల మందికి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకోగా 54,766 మందికి కార్డులు జారీ చేశారు. ఇందులో 26,220 మందికి రూ.121.40 కోట్లు మాత్రమే ఇచ్చారు.

'అన్నదాత సుఖీభవ' ఏదీ.?

ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రైతులకు అనేక హామీలు ఇచ్చారు. గత ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.13,500 పిఎం కిసాన్ నిధులతో కలిపి ఇవ్వగా, తాము అధికారంలోకి వస్తే ఆ మొత్తాన్ని రూ.20 వేలు ఇస్తామని చెప్పుకొచ్చింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సంవత్సరం పూర్తిగా ఎగ్గొట్టింది. రెండో సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న తర్వాత రెండో విడత విడుదల చేశారు. మొదట



విడతలో అన్యాయం జరగగా పలువురు కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలంటూ వినతిపత్రాలు అందజేశారు. దీంతో రెండో విడతలోనైనా న్యాయం జరుగుతుందని ఆశించగా ఈసారి కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపడంపై పలువురు కౌలు రైతులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి 80 శాతం భూమిని కౌలు రైతులే సాగు చేస్తున్నప్పటికీ అటు కేంద్ర ప్రభుత్వం గానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ కౌలు రైతులను గుర్తించడం లేదు. కేంద్ర ప్రభుత్వం అయితే పిఎం కిసాన్‌లో కౌలు రైతులను చేర్చకుండా అన్యాయం చేసింది. గత ప్రభుత్వం కౌలు రైతులకు కొంత మేలు చేసినప్పటికీ ఈ ప్రభుత్వం మొత్తం కౌలు రైతులను పక్కన పెట్టింది. నూతన కౌలు చట్టం తీసుకుని వస్తామన్న హామీని పూర్తిగా మరిచిపోయింది.

కష్టాల్లో కూడా ఆదుకోని ప్రభుత్వం

కౌలు రైతులు ప్రతి సీజన్లోనూ అనేక నష్టాలను, కష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులను సైతం కోల్పోతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సాయం చేస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నప్పటికీ కౌలు రైతులను పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. అన్నదాత సుఖీభవలో కూడా అన్యాయం చేయడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పలువురికి కోత

రెండు రోజుల క్రితం అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ రెండో విడతలో జిల్లాలో 1,50,475 మందికి రూ.99.88 కోట్లు విడుదల చేసింది. వాస్తవానికి జిల్లాలో 1.80 లక్షల మందికి పైనే రైతులు ఉండగా దాదాపు 30 వేల మందికి రెండో విడతలో కోత పెట్టారు. దీనిపై పలువురు రైతులు తీవ్రస్థాయిలో ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.



కౌలు రైతులకు అన్యాయం తగదు

గత వైసిపి ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరిగిందని గగ్గోలు పెట్టిన కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చిన తర్వాత కౌలు రైతులకు అన్యాయం చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ నిధులను కౌలు రైతులకు ఇవ్వలేదు. మొదటి విడతలో ఇస్తామని చూసినా నిరాశ తప్ప లేదు. రెండో విడతలోనైనా ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వం ఈ రైతుల పట్ల వివక్ష చూపుతోంది. ఇది సరికాదు.

- వల్లు రాజబాబు, ఎపి కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి



సొమ్ములు వస్తాయని ఆశ పడ్డాము

అన్నదాత సుఖీభవ సొమ్ములు పడతాయని ఎంతో ఆశగా చూసాము. ప్రభుత్వం మా కౌలు రైతుల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదు. అనేకసార్లు ప్రభుత్వ పథకాల కోసం వినతి పత్రాలు అందించినా నిర్లక్ష్యంగా చూస్తోంది. ఏటా నష్టాల నేపథ్యంలో ప్రభుత్వం పథకాలు ఇచ్చి ఆదుకోవాలి.

- చల్లా సంతోష్ కుమార్, కౌలు రైతు.



ఏ సాయమూ అందడం లేదు

ఐదేళ్లుగా రెండెకరాలు కౌలుకి సాగు చేస్తున్నాను. ప్రభుత్వం నుంచి ఏ సాయం అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆశించినప్పటికీ నిరాశ తప్పడం లేదు. ఇప్పటికైనా కౌలు రైతులను దష్టిలో పెట్టుకుని సాయం అందించాలి.

- పండు సత్యనారాయణ, కౌలు రైతు, కాజులూరు.

ధాన్యం సేకరణ సజావుగా సాగాలి

ప్రజాశక్తి కాకినాడ

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో డిఆర్‌ఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులు వద్ద కస్టోడియన్ అధికారి నిర్వర్తించాల్సిన విధులు, రైతు సేవ కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యానికి ఎక్నాలెడ్జ్‌మెంట్ జారీ చేసే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు 269 రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ పిపిసిలను 117 రైస్ మిల్లులకు అనుసంధానం చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభమైందని ఇప్పటివరకూ 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు నుంచి ధాన్యం సేకరించడం, సేకరించిన ధాన్యాన్ని వాహనాల ద్వారా రైస్ మిల్లుకు తరలించడం, రైస్ మిల్లులు వద్ద నమోదు ఇలా ప్రతి దశలోనూ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి రైతులకు సకాలంలో ధాన్యం సొమ్ము జమ అయ్యేలా కషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ డిఎం ఎం.దేవులా నాయక్, ఎంఎస్‌ఒ సత్యనారాయణ రాజు, పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న డిఆర్‌ఒ వెంకటరావు

సమస్యల పరిష్కారానికి భవన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. కలెక్టర్ షాన్ మోహన్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి ఎన్నికల హామీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయడానికి 18 నెలల సమయం ఎందుకు పడుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల కుటుంబాలు ఆర్థిక సహకారం కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. అందుకు ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు చేయకుండానే కార్మికులు దాచుకున్న నిధులు రూ.3 వేల కోట్లు సంక్షేమ బోర్డులో నిల్వ ఉన్నాయన్నారు. ప్రమాదాలు, అనారోగ్యంతో చనిపోయిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు బోర్డు సాయం కోసం ఎదురు చూస్తున్నాయని, తక్షణం 1214 మెమో రద్దు చేసి సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే పంచాయితీ ఎన్నికలను దష్టిలో పెట్టుకుని ప్రతి భవన నిర్మాణ కార్మికుని కుటుంబాన్ని కలుస్తూ కూటమి ప్రభుత్వ తాత్సారాన్ని, నిర్లక్ష్యాన్ని వివరిస్తామని, భవన నిర్మాణ కార్మికుల ఓట్లే పంచాయితీ తీర్పును ప్రభావితం చేయనున్నాయని హెచ్చరించారు. ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటు రేట్లలో ఉన్నా కూడా నిర్మాణాలు జరగక కార్మికులకు ఉపాధి కరువయ్యిందని, తక్షణం ఇళ్ల నిర్మాణానికి లోన్లు మంజూరు చేయడం ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఇప్పటికైనా కూటమి చంద్రబాబు ప్రభుత్వం కార్మికుల హెచ్చరికను పట్టించుకోకపోతే మంత్రులను తిరగనివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సంఘం నాయకులు తెలగారెడ్డి జీవా, ఆకుల సత్యన్నారాయణ, వెల్లంకి సత్యన్నారాయణ, చీకట్ల సాంబశివ, సీరం సత్తిబాబు, కొల్లి సత్తిబాబు, బోరా సత్తిబాబు, పప్పుల వీరబాబు, వీసం ఆనందరావు, డేగల సత్యన్నారాయణ, కరణం విశ్వనాథం, గడిగట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

యుటిఎఫ్ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-జగ్గంపేట


యుటిఎఫ్ మండల శాఖ కమిటీలను గురువారం ఎన్నుకున్నారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో నిర్వహించిన సమావేశంలో వివిధ విభాగాల్లో మూడు కమిటీలు ఎన్నికయ్యాయి. మండల గౌరవాధ్యక్షునిగా ఎన్‌విఎస్.రామకృష్ణ, అధ్యక్షునిగా జి.వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షురాలుగా బిజదుర్గాభవాని, అసోసియేట్ అధ్యక్షునిగా డి.సోమరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.సూర్యనారాయణ, కోశాధికారిగా ఎస్‌కె.చైతన్య, మహిళా కార్యదర్శిగా డి.ధారాలమ్మ, కార్యదర్శిగా బి.కోటేశ్వరరావు, సంక్షేమ పథకం కార్యదర్శిగా ఆర్‌ఎంఎన్‌బి.కుమార్, కార్యదర్శులుగా ఆవాల శ్రీను, బి.వినోద్ కుమార్, ఒ.వెంకట రమణ, ఎం.మురళీకష్ణ, డి.అప్పారావు, డి.సురేఖ, బివిఎస్. సుబ్రహ్మణ్యం, డి.దుర్గారావు, ఆడిటర్‌గా ఎ.శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవి.సాయిరాం, కార్యదర్శి పివివి. సత్యనారాయణ తెలిపారు. మహిళా కమిటీ కన్వీనర్‌గా పి.శిల్ప, సభ్యులుగా బి.దుర్గా భవాని, పి.జ్యోతి కుమారి, డి.దారాలమ్మ, బి.సుబ్బలక్ష్మి, జి.దుర్గా దేవి ఎన్నికయ్యారు.

శ్రీనివాస్ పాదయాత్ర ముగింపు

ప్రజాశక్తి- తాళ్లరేవు

పి.మల్లవరం గ్రామానికి చెందిన కాట్నం శ్రీనివాస్ పలు దేవాలయాల సందర్శనలో భాగంగా 1,640 కిలోమీటర్ల పాదయాత్ర విజయవంతంగా ముగించి స్వగ్రామం చేరుకున్నారు. ఆయనను ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ సత్కరించారు. దున్నా మురళీకృష్ణ, దున్నా ఎల్లారావు, దున్నా శ్రీనుబాబు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి పెద్దాపురం, గొల్లప్రోలు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దాపురం మండలం దివిలి, తాటిపర్తి, తిరుపతి, చంద్రమాంపల్లిలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో వైసిపి రాష్ట్ర కార్యదర్శి నెక్కంటి సాయి ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపు మురళి, నరాలశెట్టి త్రినాథ్, ఇనకొండ విష్ణుచక్రం, ఆకుల వీరబాబు, కురుమెళ్ల లోవరాజు, కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లప్రోలు పట్టణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు కోరుతూ వైసిపి పార్టీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగిలి అయ్యారావు, జ్యోతుల భీముడు, గంధం నాగేశ్వరరావు, మైనం రాజా, కౌన్సిలర్లు మైనం భవాని రాజా, బెందుకుర్తి సత్తిబాబు, సింగం నాగేశ్వరరావు, మొగిలి దొరబాబు పాల్గొన్నారు.

జగ్గంపేటలో కోటి సంతకాల సేకరణను చేపట్టారు. కోఆర్డినేటర్ తోట నరసింహం, తోట రామ్‌జీ, కరుటూరి వీరరాజు, రావుల గణేష్ రాజా, భూమడి గణపతి, గుర్రం మహాలక్ష్మి, నంగన నాని, ఉయ్యూరి నాని, పాల్గొన్నారు.



గొల్లప్రోలులో నిరసన తెలుపుతున్న నాయకులు



పెద్దాపురంలో సంతకాలు సేకరిస్తున్న దొరబాబు

దుర్గాడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన పెండెం దొరబాబు, ఒదురి కిషోర్, జ్యోతుల శ్రీనివాస్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు, గ్రామంలో ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్త, పొడి చెత్త నుంచి తయారు చేస్తున్న వర్మికంపోస్ట్ విధానాన్ని అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. శ్మశానవాటిక వద్ద శుభ్రం చేసిన ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో పిఠాపురం నియోజవర్గాన్ని సొంత నియోజకవర్గంగా భావించి అభివద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నీతిపూడి సెలెట్‌రాజు, జనసేన నాయకులు సూరిశెట్టి జయకష్ణ, పంపన సూర్యచంద్ర రావు, గంగా ఈశ్వరుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కంపోస్ట్‌ను పరిశీలిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా ముగిశాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి టి.అన్నామణి, సానా సతీష్ బాబు ఫౌండేషన్ అధ్యక్షులు తలాటం హరీష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్ వెంకట్రావు, బి.సూర్యనారాయణ, ప్రముఖ చిత్రకారులు, ఉపాధ్యాయులు ఎం.చిన్న బాబు, ఎం.సత్యబాల, రామ శేషాద్రి పాల్గొన్నారు. వారం రోజులుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో 600 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఇన్‌ఛార్జి కె.కిషోర్ తెలిపారు.

తుని శాఖా గ్రంథాలయంలో వైస్ ఛైర్మన్ ఆచంట సురేష్, టిడిపి సీనియర్ నాయకులు పరవాడ తాత బాబు, పతంజలి శాస్త్రి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. రిటైర్డ్ టీచర్ కొడుకుల నాగభూషణరావు, ఉపాధ్యాయుడు కొల్లూరు జగన్నాథం, లైబ్రేరియన్ జి.రంగనాథ రావు పాల్గొన్నారు.

సామర్లకోట డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. లైబ్రేరియన్ బందిల రత్నామణి, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, ఎఎంసి ఛైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, దొమ్మేటి శ్రీనివాస్, కౌన్సిలర్ బలుసు వాసు, పిట్టా జానకి రామారావు, అందుగుల జార్జి చక్రవర్తి, నూతలపాటి అప్పలకొండ, లింగం రాంబాబు, ఉపాధ్యాయులు గురు ప్రకాష్, ఆగ్నేయ, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు. పెదబ్రహ్మదేవంలో సర్పంచ్ నీలపాల సత్యనారాయణ లేబ్రేరియన్ సి.మణికుమారి ఎంపిటిసి వైబిబి.ప్రసాదరావు

ఏలేశ్వరం విద్యార్థులకు వైస్ ఛైర్‌పర్సన్ శిడగం త్రివేణి బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రయాగమూర్తి ప్రగడ, లేబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి ఎంఇఒలు వేణుగోపాల్, పైడి రాజు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం శాస్త్రి, అన్నపూర్ణ, శ్రీమనోజ్ పాల్గొన్నారు.

పెద్దాపురం డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు శాఖా గ్రంథాలయంలో ముగింపు సభలో పాల్గొని ప్రసంగించారు. కవి జోష్యుల కృష్ణబాబు, లైబ్రేరియన్ పాలంకి నాగరాజు, గోమాడ వీరబాబు, మామిడి ఈశ్వరరావు, చెరుకూరి రవి, కొయ్యాన ధర్మారావు, రంధి సత్యనారాయణ, తూతిక రాజు, తాళాబత్తుల సాయి, కొరుపూరి రాజు, రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, డివిఎస్.రామకృష్ణ, యాళ్ల వీరబాబు, పొలమరశెట్టి సత్తిబాబు, లక్ష్మణ్ దివాకర్, మార్ని చిన్న, ఒబిలిశెట్టి గణేష్, అనివిళ్ల శాస్త్రి పాల్గొన్నారు.

పిఠాపురం మున్సిపల్ కమిషనర్ పి.రాజు, ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్ శర్మ మాట్లాడారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కొండేపూడి శంకర్రావు, సలాది సాయి, సత్యనారాయణ, లేబ్రేరియన్ రేపాక వెంకట రాము, భారత్ హైస్కూల్ ప్రిన్సిపల్ గట్టి శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

పెదపూడి గ్రంథాలయ అధికారి ఎంవిఎన్ఎస్.కృష్ణవర్ధన్ ముగింపుసభ, విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కలవల కృష్ణమూర్తి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

కరప వేళంగి, కరప గ్రంథాలయాల్లో విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శి నిర్మలా దేవి ఆధ్వర్యాన మెర్ల కృష్ణ ప్రసాద్ అందజేశారు. పి.వెంకట రంగయ్య, రవి వర్మ, డాక్టర్ బోండా వెంకన్నరావు, హెచ్ఎం కె.త్రిమూర్తులు పాల్గొన్నారు.



కాకినాడ గ్రంథాలయంలో బహుమతులు సాధించిన విద్యార్థులు



తునిలో బహుమతులు అందిస్తున్న వైస్ ఛైర్మన్ సురేష్

చేనేతను రక్షించి కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

తీవ్ర సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను రక్షించి కార్మికులను ఆదుకోవాలని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన పెద్దాపురంలో మాట్లాడుతూ చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం ఈ నెల 23న కాకినాడ కుళాయి చెరువు ఆవరణలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పెద్దాపురం చేనేత సహకార సంఘాల పరిధిలోని చేనేత కార్మికులు, చేనేత నాయకులు, చేనేత సహకార సంఘాల నేతలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆప్కో సహకార సంఘాల నుంచి కొనుగోలు చేసిన వస్త్ర బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం నుండి రావలసిన పావలా వడ్డీ, యార్న్ సబ్సిడీ, డిసిసిబి బ్యాంకు రుణాలు, 30 శాతం రిబేటు బకాయిలు వెంటనే విడుదల చేసి చేనేత సహకార సంఘాలను ఆదుకోవాలన్నారు.



ముప్పన వీర్రాజు

22న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

చొల్లంగి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం 09.00 గంటల నుంచి మధ్యాహ్నం 02:00 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ ఎన్.ఉదయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు చొల్లంగి ఇండిస్ట్రియల్, జి.వేమవరం ఫీడర్, చొల్లంగి హెడ్‌క్వార్టర్, పటవల పరిధిలోని మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఆధార్ సెంటర్లలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి-గండేపల్లి

విద్యార్థులు ఆధార్ కార్డులను ఐదేళ్లకు ఒకసారి అప్డేట్ చేసుకోవాలని ఎంపిడిఒ సత్యారెడ్డి తెలిపారు. రామయ్యపాలెం, తాళ్లూరు, నీలాద్రిరావుపేటల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను గురువారం ఆయన పరిశీలించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని డివిజనల్ అధికారి బాలమణి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన గండేపల్లి సచివాలయం వద్ద మండల పంచాయతీ కార్యదర్శితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో ఇంటి పనులు వసూలు చేయడం వేగవంతం చేయాలని సూచించారు. సంపద కేంద్రాలని అభివృద్ధి చేయాలని, ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాస్, పంచాయతీ అధికారులు ఫనీంద్ర కుమార్, పోతుల శిరీష, తరంగిణి, బాలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పెద్దాపురం

మండలం కొండపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎవిఎస్ ఫణి కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 18న కాకినాడలో డిఎస్‌ఎ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా టీమ్‌కు ఎంపికయ్యారన్నారు. అండర్ 17 బాలుర విభాగంలో శ్రీకాకుళపు కార్తీక్ ఖోఖో పోటీకి, అండర్ 14 విభాగంలో వానపల్లి ఉమా మహేష్ కబడ్డీ పోటీకి ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకూ కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో జిల్లా టీము విద్యార్థులు పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్ఎం ఎవిఎస్.ఫణి కుమార్, ఎస్ఎంసి ఛైర్మన్ కాకరపల్లి దాసు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రిటైర్డ్ ఎంఇఒ రూ. 35 లక్షలు కాజేసిన వైనం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సైబర్ నేరగాళ్ల వలలో పడి రిటైర్డ్ ఎంఇఒ సుమారు రూ. 35 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మ చింత ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఎంఇఒకు నవంబర్ 8న అపరిచిత వ్యక్తి వీడియో కాల్ చేశారన్నారు. మీ ఆధార్ ద్వారా రూ.3 కోట్ల అక్రమ లావాదేవీలు జరిగాయని, దీనిపై కేసు నమోదైందని హెచ్చరించారన్నారు. ఈ కేసు మాఫీకి రూ.70 లక్షలు ఇవ్వాలని ఆగంతకులు వాట్సాప్ కాల్‌లో బెదిరించారన్నారు. దీంతో భయపడిన రిటైర్డ్ ఎంఇఒ విడతల వారీగా బంధన్ బ్యాంక్ మహారాష్ట్ర శాఖకు రూ.15 లక్షలు, చెన్నై తిరువాయూర్ శాఖకు రూ.9.8 లక్షలు చొప్పున రెండుసార్లు వెరసి రూ.34.60 లక్షలు ఆగంతకులకు ముట్టజెప్పారన్నారు. అనంతరం మోసపోయానని గ్రహించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక టెలికం కాలనీలో ఈ నెలన ఉపాధ్యాయుడు పెంకే సింహాచలం ఇంటిలో రూ.6 లక్షలు నగదు చోరీ చేసిన నిందితుని అరెస్టు చేసినట్టు డిఎస్‌పి శ్రీహరి రాజు తెలిపారు. గురువారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న రాత్రి పెద్దాపురం-సామర్లకోట రహదారిలో ఉన్న అయోధ్య ఆలయ గ్రౌండ్ లే అవుట్ వద్ద ఎర్రంశెట్టి చరణ్ విగ్నేష్‌ను అరెస్టు చేసి రూ.3,60,000 నగదు, ఒక సెల్ ఫోన్, హోండా యాక్టివా బైక్ రికవరీ చేశామన్నారు. తన కుమార్తె పెళ్లి కోసం ఇంటిలో ఉంచిన రూ.6 లక్షలు చోరీకి గురైనట్లు ఉపాధ్యాయుడు సింహాచలం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ సమావేశంలో సిఐ విజయ శంకర్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

కిర్లంపూడి మండలం వేలంక గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేసిన ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.9,600 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్టు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు.

పుంగనూరు ఆవు దూడ అపహరణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్లలో మేలు జాతి పుంగనూరు ఆవు దూడ బుధవారం అర్ధరాత్రి అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని పినపళ్ళకు చెందిన ఎంపిటిసి సభ్యులు పెద్దిరెడ్డి పట్టాభి రామన్నకి చొప్పెల్లలో ప్రత్యేక కార్యాలయం ఉంది. అక్కడే వివిధ రకాల పశు సంతతిని పెంచుతున్నారు. మకాంలో పుట్టిన పుంగనూరు జాతి దూడ పుట్టింది. ఆ దూడను ఇటీవల కొందరు బేరగాళ్లు సుమారు రూ.2.50 లక్షలకు అడిగిన ఆయన అమ్మడానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని దుండగులు కార్యాలయ సిసి కెమెరా వైర్లను కట్ చేసి బుధవారం అర్ధరాత్రి అపహరించుకు పోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

సత్యనారాయణకు పరామర్శ

ప్రజాశక్తి-గండేపల్లి

యర్రంపాలెంకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు ముత్యాల సత్యనారాయణ తల్లి సరస్వతి ఇటీవల మరణించడంతో టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు సత్యనారాయణను పరామర్శించారు. సరస్వతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల దుర్గారావు, ముత్యాల భాస్కరరావు, బిక్కిన వెంకటరమణ, బిక్కిన వీరభద్రరావు, ముత్యాల రాంబాబు, ముత్యాల వీరభద్రరావు, ముత్యాల సత్యనారాయణ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-కాకినాడ

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు అన్నారు. సంకురాత్రి ఫౌండేషన్ శ్రీకిరణ్ ఆప్తమాలజీ వ్యవస్థాపక దినోత్సవంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రక్తదానం చేసినట్టు ఆయన తెలిపారు. యువత ఆరోగ్యంగా ఉంటూ రక్త దాతలుగా ముందుకు రావాలన్నారు. ప్రమాదాల్లో, రోగులకు రక్తం దానం చేయడం చాలా ఆనందకరమని డాక్టర్ నాయుడు అన్నారు. రోగుల అవసరాలను బట్టి ఎప్పటికప్పుడు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. రక్తదాతలను సంకురాత్రి ఫౌండేషన్ ఎమ్‌డి పద్మశ్రీ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, డి.అశ్విని అభినందించారు.

వ్యవసాయంపై రైతులకు మెలకువలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

వ్యవసాయంపై రైతులకు మెలకువలు నేర్పుకునేందుకు 14 వారాలు శిక్షణ ఇచ్చినట్టు ఎఒ జోగినాయుడు తెలిపారు. గురువారం గోర్స గ్రామంలో పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మంచి వ్యవసాయ మెలకువలు, సమగ్ర సంరక్షణలో చీడ పీడలను నియంత్రించే పద్ధతులు, మంచి విత్తన ఉత్పత్తి సేకరణ వంటి సూచనలను 14 వారాలపాటు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.విజయకుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు పి.స్వాతి, పి.భాస్కర్, గంధం సీతయ్య కాపు, ఎ.సుబ్రహ్మణ్యం, అంజు గీతాశ్రీ, రామకృష్ణ వేణి పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాలపై తహశీల్దారు సమీక్ష

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి మల్లవరంలో నెల 26న జరిగే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఏర్పాట్లపై తహశీల్దారు రామ్మోహన్ గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు కమిటీ సభ్యులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదు

ప్రజాశక్తి -సామర్లకోట

రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత మాజీ మంత్రి కురసాల కన్నబాబుకు లేదని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామర్లకోట మండలం అచ్చంపేటలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ పూర్తిగా విఫలమైందన్నారు. అటువంటి వైఫల్యాల నుంచి వచ్చిన కన్నబాబుకు కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే నైతిక అర్హత లేదని ధ్వజమెత్తారు. ఆయన వ్యవసాయ మంత్రిగా ఉండగా రైతుల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుంటే ఆయన ఓర్వలేక పోతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు విపరీతంగా జరిగాయన్నారు. కేంద్రం అందించిన సాయం తప్ప రాష్ట్రం నుంచి రైతులకు ఎలాంటి సహకారం అందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రం అందించే సాయంతో పాటు రాష్ట్రం నుంచి కలిపి రైతులకు అందిస్తే వారి ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అత్యాధునిక డ్రోన్ పరిజ్ఞానంతో వ్యవసాయం చేసుకునే పరిస్థితిని కూటమి ప్రభుత్వం రైతులకు అందుబాటులోకి తెచ్చిందన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో సిద్ధం కావాలి

ప్రజాశక్తి - సామర్లకోట

పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే వందరోజుల ప్రణాళికతో ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య సూచించారు. గురువారం ఆయన అయోధ్యారామపురంలోని పిఎంశ్రీ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో విద్యాశాఖ అమలు చేయనున్న 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను ఉపాధ్యాయులు కచ్చితంగా అమలు చేసి విద్యార్థుల ఫలితాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యాయులు కె.గంగా భవాని, టిఆర్ఎస్.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ

నేడు ఉద్యోగుల పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వం సూచనల మేరకు శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల పిజిఆర్ఎస్ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్లో ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. అధికారులందరూ ఈ నెల 21వ తారీకు 3.45 నిమిషాలకు కాకినాడ కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌కు హాజరు అవ్వాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని గమనించి ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



గోదాము వద్ద రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

ఇవిఎంల గోడౌన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-కాకినాడ

కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం, వివి.ప్యాట్ గోదామును కలెక్టర్ షాన్ మోహన్ సగిలి రెవెన్యూ, ఎన్నికలు, పోలీస్ శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఇవిఎం, వివి.ప్యాట్‌ల రక్షణ, భద్రతకు సంబంధించి ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ యంత్రాల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల గోదామును తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, ఎన్నికల డిటి ఎం.జగన్నాథం ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం మానసిక వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ గురువారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. క్లబ్ సభ్యులకు వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు. వికలాంగులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు మానేపల్లి రామానుజ, ఎం.బంగార్రాజు, కొత్త కొండబాబు, నాళం ఆండాళ్, మామిడిపాక సతీష్, కంచర్ల వెంకట సత్యనారాయణ, బొండా సత్యనారాయణమూర్తి, జి.నాగబాబు పాల్గొన్నారు.



వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పచ్చదనం-పరిశుభ్రత గ్రామాలుగా తీర్చిదిద్దడంపై గురువారం జి.రాగంపేటలో ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల పరిధిలోని పంచాయతీల కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, గ్రీన్ గార్డులు పాల్గొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులను జెడ్పి సిఇఒ వివిఎస్.లక్ష్మణరావు పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన మాస్ సానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జెవి.శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు జి.మామిడాడ విద్యార్థులు

ప్రజాశక్తి-పెదపూడి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని జి.మామిడాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముమ్మిడి రవి తెలిపారు. జి.మామిడాడ లో ఆయన గురువారం మాట్లాడుతూ కాకినాడలో స్కూల్ గేమ్స్ కబడ్డీ అండర్-14 విభాగంలో ఇ.మహిజ, అండర్-17 విభాగంలో కె.చైత్ర ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు ఈ విద్యార్థులు మచిలీపట్నం, కర్నూలు జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుని కె.తులసి అభినందించారు.



కళ్లజోళ్లు అందిస్తున్న ఎంఎల్ఎ పంతం నానాజీ

243 మందికి కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి -కరప

ఆదేశం ఫౌండేషన్ సమకూర్చిన కళ్లజోళ్లను కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ గురువారం అందజేశారు. ఇటీవల జనసేన పార్టీ ఆధ్వర్యంలో 5వ కార్తీక వన సమారాధనలో ఆదేశం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంజు కంటి ఆసుపత్రి ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 520 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 243 మందికి కళ్లజోడులు అవసరమని గుర్తించారు. కాకినాడ ఎంఎల్ఎ నానాజీ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు భోగిరెడ్డి కొండబాబు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ముద్రగడ రమేష్, భోగిరెడ్డి గంగాధర్, నక్క బ్రహ్మాజీ, పుల్ల శ్రీరాములు పాల్గొన్నారు.

ఆలయంలో చర్చి ఫాదర్ అన్నదానం


ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు జాతీయ రహదారిలో అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా రోజూ దాతల సహకారంతో భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. 30వ రోజు గురువారం క్రైస్తవ చర్చిలు నడుపుతున్న ఒక ఫాదర్ స్వాములకు భోజనాలు ఏర్పాటు చేసి మతసామరస్యం చాటారు. జెడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఆయన సతీమణి వెంకట దుర్గా దేవి, చిట్టూరి చలపతి, పెట్ట సూర్యనారాయణ రాజు, పితాని బాల వెంకటరమణ, సంగాడి ప్రసాద్, భాస్కరేశ్వర, దొమ్మేటి సత్యనారాయణ తదితరులు ఆయనను అభినందించారు.

సిటీ, రూరల్ రూపు రేఖలు మారుస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాబోయే పుష్కరాల నాటికి సిటీ, రూరల్ నియోజకవర్గాల రూపు రేఖలను మారుస్తామని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. గురువారం గోరంట్ల స్వగృహంలో మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన అనేక విషయాలపై చర్చించారు. నూతనంగా 5 ఎంఎల్‌డి ప్లాంట్లు నిర్మించాలని, మెయిన్ రైల్వే స్టేషన్ రోడ్డు, ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్లను విస్తరణ చేయాలని, ప్రధాన డ్రైనేజీ నిర్మించాల్సిన అవసరం ఉందని, హుకుంపేట మెయిన్ డ్రైనేజీని చివరి వరకు నిర్మించాలని, క్వారీ సెంటర్ నుంచి మల్లయ్య పేట వరకు రోడ్డును విస్తరణ చేసే సిసి రోడ్డు నిర్మించాలని, ఎన్‌విజ మార్కెట్ నుండి 100 అడుగుల రోడ్డు వరకు రోడ్డు విస్తరణ చేసి డ్రైనేజీ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, వార్డులన్నింటిని జీరో వర్క్ వార్డులుగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఇ శేషగిరిరావు, రిటి, మున్సిపల్ ఇఇలు మాధవి, ఆర్, డిఇలు సత్యనారాయణ, లోవరాజు, రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌ను సత్కరిస్తున్న ఎంఎల్ఎ గొల్లపల్లి అశోక్

లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్‌నాథన్‌ను స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గురువారం కలిశారు. యానాంకి సంబంధించిన పలు అంశాలు చర్చించినట్లు ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. దరియాలతిప్ప బలాంద్ నెంబర్ 3 సమీపంలో ఆగస్టు 22న జరిగిన గ్యాస్ లీకేజ్ ఘటనకు సంబంధించి ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. త్వరలో కలెక్టర్ యానాం వచ్చి దర్యాప్తు చేయనున్నారని ఎంఎల్ఎ గొల్లపల్లి తెలిపారు.



శంకరనారాయణను సత్కరిస్తున్న నాయకులు, సిబ్బంది

శంకరనారాయణకు ఘన సత్కారం

ప్రజాశక్తి-తాళ్లరేవు

సుదీర్ఘ కాలం తాళ్లరేవు పంచాయతీ కార్యదర్శిగా పని చేసి ప్రమోషన్‌పై వెళ్లిన నున్న శంకరనారాయణను గురువారం ఘనంగా సత్కరించారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, రెడ్డి బాబిబాబు, డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్‌ఎస్‌ఎం.ప్రకాష్, నడింపల్లి విజయ్, వాసంశెట్టి శ్రీనివాస్, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, జాలెం వెంకన్నబాబు, వాకపల్లి చిరంజీవి, చిట్టూరి చలపతి, రోళ్ల చక్రవర్తి, సతీష్ రాజు, మేడిశెట్టి సత్తిబాబు, పొన్నాడ భైరవమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఉదయ్, పాల్గొన్నారు.

మున్సిపల్, మెప్మా సిబ్బందికి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో నిర్వహించనున్న వజ్రోత్సవ వేడుకలలో భాగంగా గురువారం రోటరీ కల్యాణ మండపం ఆవరణలో మున్సిపల్, మెప్మా సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో విజేతలకు ఈ నెల 26, 27, 28 తేదీలలో జరిగే వజ్రోత్సవ వేడుకలలో బహుమతులు అందజేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వార్షిక తనిఖీలో భాగంగా గురువారం సౌత్ జోన్ డిఎస్‌పి ఎస్.భవ్య కిషోర్ ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది, సదుపాయాలు గురించి సిబ్బందితో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల గౌరవం, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. 112 కాల్స్‌కు వెంటనే స్పందించి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. మహిళలు, మైనర్ బాలికలపై జరిగే నేరాల విషయంలో పోలీసు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ హోల్డర్లు, బ్లేడ్ బ్యాచ్‌లపై నిరంతర నిఘా పెట్టి వారి కదలికలను జాగ్రత్తగా గమనించాలని ఆమె ఆదేశించారు.

పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి - ఉంగుటూరు, చాగల్లు

ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో థీమ్-5లో భాగంగా పచ్చదనం- పరిశుభ్రతపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్య వంతమైన సమాజాన్ని తీర్చిదిద్దవచ్చునని సూచించారు. మండల విస్తరణ అధికారి ఆంజనేయ శర్మ మాట్లాడారు. గ్రామస్థాయి పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీ వాసు శిక్షణ ఇచ్చారు. చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రావణ కుమార్ పాల్గొని మాట్లాడారు.